# కరిగిన కల

గబ గబా డబ్బులు లెక్కపెట్టి మళ్ళీ మూటకట్టుకుని మొల్లో పెట్టుకుంది వరాలమ్మ. ఎన్నిసార్లు లెక్కట్టిన ఇప్పటికి కూడేసినవి పావలామీద రెండుపైసలు.

ఆమె ఏదో మొలో దాచుకోవడం చూసిన సూరిగాడు అప్పా ఏటి అవీ! నా కెట్టవా? అడిగాడు ఆశగా చెయ్యి చాపుతూ. "ఏట్రా! ఏటీ నేవు" వాడి తలమీద సన్నగా మొట్టింది వరాలమ్మ.

"ఓలమ్మో అప్పేటో దాసేస్తుంది!" అరవబోయాడు సూరిగాడు.

"అరవక అమ్మతో సెప్పక! ఏటీనేవు పెసరబద్దలు. శివరాత్రి తీర్థంల తిరుగుత ఇద్దరం తిందాం. సీకు నాపుగ పప్పులెడతాను" అని అనునయించి వాడినోరు కట్టించింది వరాలమ్మ.

ఎవరూ చూడకుండా పెణకన దోపేసిందామూట. ఇంకో మూడుపావలాలు కూడెయ్యాల అనుకుందా రాత్రి

మంచంమీద వాలుతూ. ఆ రాత్రి ఆమె కలలనిండా ఎంకటేసు. అతనితో తిరిగినట్లు, కబుర్లు చెప్పినట్లు, సినిమాలు చూసినట్లు, మంచి మంచి పూలకోకలు కట్టుకున్నట్లు.

ఆమె కమ్మని కలలు సాగుతూనే వున్నాయ్. "వరాలూ నెగు నెగు; కట్టెల కెలిపోతన్రు" అని తట్టిలేపి ఆమె కలలు చెరిపేసింది వరాలమ్మతల్లి తలుపులమ్మ.

కళ్లు నులుముకుంటూ లేచి చల్దిగిన్నె తలమీద పెట్టుకొని కత్తి చేత్తోపట్టుకొని జట్టువాళ్ళతో కొండకు బయల్దేరింది వరాలమ్మ. ఇవ్వాళ పెద్దమోపు కట్టెలు నరకాల. రెండున్నర రూపాయలకు అమ్మి అమ్మకి రెండు రూపాయలే వచ్చినయని సెప్పి అర్ధరూపాయి ఎనకెయ్యాల అప్పాసు ముప్పాలా అవుద్ది. రేపు మరొక అర్ధరూపాయెనకేస్తె మొత్తం రూపాయిపావలా. రూపాయి కొబ్బరికాయ, అణా ఊదొత్తులు, కర్పూరపుబిళ్ళ. పదిపైసల టిక్కెట్లు. మిగిలిన డబ్బులుపెట్టి సూరిగాడికి పప్పులుకొనాల. ఇదీ ఆమె ఆలోచన. జట్టువాళ్లు ఆ ఊర్లో జరగబోయే తీర్ధంగురించీ, తమ యింటికి రాబోయే బంధువుల గురించీ ఇంకా తీర్ధంలో తాము కొనబోయే వస్తువుల గురించీ గలగలా మాట్లాడుతున్నారు. కాని వరాలమ్మ కివేమీ వినిపించటంలేదు. నాలుగురోజుల క్రితం తనను చూడటానికివచ్చిన ఎంకటేసు, ఎంకటేసుకీ తల్లికీ మధ్య జరిగిన సంభాషణ. ఎంకటేసు అందం, ఆ ఠీవి. అతను తనవైపు చూసిన చూపులు నెమరువేసుకుంటూ అన్యమనస్కంగానే వారితో నడుస్తూంది. కొండకి చేరేసరికి

ప్రకృతిపై సూర్యకిరణాలు ప్రసరిస్తున్నాయ్. చల్దిగిన్నెలు ఓ చెట్టుకింద పెట్టుకొని కత్తులు పట్టుకొని తలొకవైపూ నడిచి పుల్లలు నరకడం మొదలుపెట్టారందరూ.

జాముపొద్దెక్కాక పుల్లలన్నీ ఓ దగ్గరకు చేర్చుకొని, చల్దులుతిని మోపులుకట్టుకున్నారు. వరాలమ్మ మోపుచూసి నవ్వుతూ "ఏటి వరాలు అంతమోపు కట్టినవు మొయ్యగల వేటే", అడిగింది వరాలమ్మ స్నేహితురాలు అప్పలనరస.

"ఓస్ ఇదేపాటి మోపు? ఎత్తు!" అని తలమీద చుమ్మ పెట్టుకుంది. అప్పలనరస అతికష్టంమీద వరాలమ్మ తలకామోపు ఎత్తింది.

గబగబా అందరితోపాటు తానూ కఱ్ఱలబరువుకి మెడజవలు వంగుతూంటె ఊరివైపు నడిచింది వరాలమ్మ.

తనదగ్గర కఱ్ఱలుకొనేవారి వాకిట నిల్చుంటూ "అమ్మా కఱ్ఱలేసుకోరూ!" అడుగుతూంది వరాలమ్మ.

"ఎంతకిస్తావే?" అని అడిగేసరికి రెండున్నర అంటూంది వరాలమ్మ.

అందరూ రూపాయి-రూపాయిన్నరా ఇస్తామనేవారే గాని ఎవరూ రెండురూపాయిలన్నా ఇస్తామనడంలేదు. నడినెత్తికొచ్చాడు సూర్యుడు. ఎండ ఛుర్రుమంటూంది.

గబగబా మరొకవీధికి మళ్ళి, ఓ మేడవాకిట నిల్చుని "అమ్మా కఱ్ఱలండీ! మంచిపేళ్ళండి, వేయించుకోండమ్మా,

శివరాత్రెళ్ళేదాకా మీకు కఱ్ఱలు దొరకవండి" అని గట్టిగా కేకేసింది వరాలమ్మ.

చప్పున ఆ ఇంటిఇల్లాలు ఇవతలికివచ్చి "మరీ విడ్డూరమే. ఈ ఊర్లో కఱ్ఱలకు కరువటే మీ లాటివాళ్ళు చల్లగా ఉండాలిగాని. ఎంతకిస్తావేమిటి?" అడిగింది. ఆ ఊర్లో చాలామంది పేదలకు ఈ కఱ్ఱలుకొట్టి అమ్ముకోవటమే వృత్తీ జీవనోపాధీను.

"రెండున్నరియ్యండి" అంది వరాలమ్మ.

"ఆఁ రెండున్నరా? ఎందుకూ అక్కడ్లే పట్టుకుపో" అందామె లోపలికి వెళ్ళిపోబోతూ.

వరాలమ్మకు మెడలు నొప్పులు పెడుతున్నాయి తలంతా దిమ్ముగా ఉంది. దాహంగా ఇంకా ఆకలిగావుంది, ఇంక మరోఇంటికి వెళ్ళి అమ్మే ఓపిక లేదు. 'అడగండమ్మ గోరూ!' అంది నవ్వబోతూ.

"ఇంకేమిటి అడగటం? ఏకంగా రెండున్నర చెబుతూంటివి" అందామె ఆగి నిల్చుని.

"రెండు రూపాయిలిచ్చెయ్యండమ్మగోరూ!"

"రెండురూపాయలే!" బుగ్గలు నొక్కుకుండా ఇల్లాలు ఆశ్చర్యం ప్రదర్శిసూ.

"కొండలుఎక్కి సెట్టుకోపుల్ల ఏరుకొత్తం, ఏటండమ్మ గోరు, అలాగంతరు?"

"రూపాయిన్నర ఇస్తాను. పడేసిపో!"

"అలాగంటె ఎలా అమ్మగోరు. మరో మాట అడగండి."

"ఇంకేంలేదు. అలా వేస్తేవెయ్, లేకపోతే వెళ్ళిపో!"

"మరో పావలా ఏసుకోండమ్మగోరు!"

వరాలమ్మవైపూ, ఆమె తలమీదున్న మోపువైపూ ఓసారి చూసి "పడెయ్ లే అయితే, సన్నగ చీరేసి వంటసాల్లో పేర్చెయ్" అని లోపలికి వెళ్ళిందా ఇల్లాలు.

"సీ! ఎదవ జలమలు, ఎదవ బతుకులు. కొండకెత్తె గాని కడుపు గడవదు." అని గొణుక్కుంటూ, కట్టెలమోపు దబ్బున ఎత్తేసి "మంచినీళ్ళియ్యండమ్మగోరూ!" గట్టిగా అరిచింది వరాలమ్మ.

చెంబుతో మంచినీళ్ళిచ్చి "సన్నగా చీరెయ్ కట్టెలు! లేకపోతే మండవు!" అని మరోసారి హెచ్చరించిందా ఇల్లాలు.

మంచినీళ్ళు గటగటా తాగేసి, కట్టెలుచీరి సాల్లో పడేసి డబ్బులు తీసుకుని, అర్ధరూపాయి మొలలో పెట్టుకొని రూపాయిపావలా చేత్తో పట్టుకొని ఇంటివైపు నడిచింది వరాలమ్మ.

"ఏం? శత్తి సన్నగిలిపోయిందా? పండుగకర్చుంటదని ఎరగవూ! మూడు పుల్లేల్లుకొచ్చి, రూపాయిపావలా కమ్మినావా? ఈ డబ్బులుకి నూకలేటొత్తయి?" అని ప్రశ్నించి,

అవ్వాళ మరీ బొత్తిగా రూపాయిపావలా మాత్రమే తెచ్చినందుకు చిరాకుపడిపోయింది వరాలమ్మమీద తలుపులమ్మ.

మౌనంగా ఉండిపోయి. తర్వాత ఎవరూ చూడకుండా ఈ అర్ధరూపాయికూడా పెణకనదాచిన పావలామూటలో కట్టేసింది వరాలమ్మ.

మర్నాడు మళ్ళీ కొండకెళ్తూన్న వరాలమ్మను "బరువుగ మోపట్టుకొచ్చి మూడురూపాయలకమ్మ!" అని హెచ్చరించింది తలుపులమ్మ.

మూడురూపాయలు కాకపోయినా అధమం రెండున్నర రూపాయలకన్నా అమ్మాలనుకుంది వరాలమ్మ. రేపే దేవుడికి మొక్కు చెల్లించుకోవాలి. ఇవ్వాళ ఎలాఅన్నా అర్ధరూపాయి మిగుల్చుకోవాలనుకుంది. కాని ఇవ్వాళ మోపు నాలుగు వీధులు తిప్పినా రూపాయిన్నరకన్నా ఎక్కువ రాలేదు. ఇవ్వాళ డబ్బులెలా మిగుల్చుకోవాలి అని ఆలోచించడంతో విసిగిపోయింది వరాలమ్మ. ఎలాఅన్నా దేవుడికి రేపు కొబ్బరికాయ కొట్టాల. ఎంకటేసుతో తనకు మనువుకుదిరితే పున్నిగిరి దేవుడికి కొబ్బరికాయ కొడతానని దణ్ణం పెట్టుకుంది. చూసి వెళ్లిన మర్నాడు పిల్లనచ్చిందని కబురుచేసాడు. పున్నిగిరి దేవుడెలా అన్నా సత్యమైన దేవుడు. మొక్కు చెల్లించాలనుకుంది వరాలమ్మ దృఢంగా. ఎలా మిగల్చాలె అర్ధరూపాయి అని చురుగ్గా ఆలోచించిన వరాలమ్మకి మెరుపులా ఒక ఆలోచన వచ్చింది. గబగబా ఇంటిముఖం పట్టింది.

* * *

ఇంటికి వస్తూనే ఏడవటం మొదలుపెట్టింది వరాలమ్మ. ఏటయ్యిందె కూతర ? అంటూ కంగారుపడిపోయింది తలుపులమ్మ.

"నేను వత్తంతె .... మోపమ్మి డబ్బులట్టుకు వత్తుంతె నారీగుద్దుకు పడిపోన్ను" అంది వరాలమ్మ వెక్కిళ్ళమధ్య.

"ఓల నా కూతురో!" అని లారీ తోలేవాణ్ణి అడ్డమైన తిట్లూ తిట్టి "డబ్బులుపోనాయా ?" అడిగింది తలుపులమ్మ.

"అద్దురూపాయి జారిపోనాది" అంది వరాలమ్మ.

'పోనై. ఆ ఎదవ దినవారం సేసుకోనీ' అని ఒక్క రూపాయితోనే సంతృప్తిచెందింది తలుపు.మ్మ.

"అమ్మా ఎంకటేసుమావ తీర్ధానికొస్తాడ?" అని అడగా లనుకుంది చాలాసార్లు వరాలమ్మ కాని అడగలేకపోయింది. కాని ఎంకటేసు తీర్ధంనెపంతో తనను చూడాలని వస్తాడనే అనుకుంటూంది వరాలమ్మ. ఆ రాత్రంతా ఆమెకు కమ్మని కలలు. కలల నిండుగా ఎంకటేసు. ఎంకటేసూ తనూ తీర్ధంలో కబుర్లు చెప్పుకుంటూ తిరుగుతూన్నట్లు, ఎంకటేసు తనకు పువ్వులకోక కొనియిచ్చినట్లు ఇంకా ఇద్దరూ పున్నిగిరి కొండెక్కినట్లు, దేవుడికి కొబ్బరికాయ కొట్టి మొక్కు చెల్లించు కున్నట్లు. మత్తుగా, తియ్యగా మెలకువ వచ్చింది, తెల్లవారు తూంది. తృళ్ళిపడి లేచికూచుని "అమ్మా తానానికెల్తానె" అంది వరాలమ్మ.

"ఇయ్యాలేం తానం? రేపెళ్దువుగాని. ఇయ్యాళ జాగరంసేసి రేపు తానానికెళ్ళు" అంది తలుపులమ్మ.

ఇవ్వాళే వెళ్తానని వరాలమ్మ ఎంత బ్రతిమిలాడినా వెళ్ళనిచ్చింది కాదామెను తలుపులమ్మ. మర్నాడు ఉదయాన్నె పెణకన దాచినమూట మొలలో భద్రంగా దాచుకొని అమ్మా 'తానానికెల్తానే!' అడిగింది వరాలమ్మ.

'అందరంతన్నరు, ఇనలే దేంటి. కోటిలింగాల రేవుకాడ ఆడమనిషి జారిపడి సచ్చిపోయిందట. నువ్వెల్లకు కూతరో!' అంది తలుపులమ్మ. చిరాకేసింది వరాలమ్మకి. కోపం వచ్చింది. 'నానేం సచ్చిపోనులె యెల్తాను!' అంది.

'ఎలా యెల్తావో సూణ్ణా! ఎంకటేసు ఊరోకొచ్చినాడంట. వల్లక ఇంటికాడుండు! తానం మరోనాడు సేద్దువుగానీలే.'

దేవుడి మొక్కు!.... ఎంకటేసు రాక, ఎటూ తోచలేదు వరాలమ్మకి. అయినా దేవుడి మొక్కు చెల్లించాలనుకుని వెళ్తానని తల్లితో వాదనకి దిగింది. ఇంతలో ఎవరో చుట్టం వచ్చాడు.

మంచం వాల్చి, మంచినీళ్ళిచ్చింది తలుపులమ్మ.

తలుపు చాటునుంచి తొంగిచూసింది వచ్చిన వ్యక్తి వైపు వరాలమ్మ.

తనకు మనువు కుదర్చబోయే మధ్యవర్తి సత్తెం నాయుడు.

అతని నోటినుంచి రాబోయే మాటలకోసం చెవులు రిక్కించి గుండె దడదడలాడుతూంటె తలుపుచాటున నక్కి-నిల్చుంది వరాలమ్మ.

ఆ మాటా ఈ మాటా చెప్పి అరిసెలు ఫలహారంచేసి 'సెల్లెమ్మా, ఎంకటేసు వెయ్యిరూపాయిలు కట్నం యిత్తేగాని వరాల్ని సేసుకోనంటున్నాడు. పోనీ మరో మంచి కుఱ్ఱో డున్నడు కనుక్కుంతను.' అన్నాడు సత్తెంనాయుడు.

'కట్నం నానేటిచ్చుకోగల్ను? ఉద్దోగత్తుడు సేసుకోడని ముందే అనుకున్నాన్లే. మరో మనువుసూడు.' తలుపులమ్మ గొంతు.

రైల్వే ఉద్యోగస్థుడు ఎంకటేసు మనువాడతాడని కలలుకంటూ దేవుడికి మొక్కుకున్న వరాలమ్మ ఈ మాటలు వినరావడంతో అలానె నిల్చున్నచోటనె చతికిలబడిపోయింది. 'ఎంకటేసుకి వెయ్యిరూపాయలు కావాలా?' ఆమె పెదవులు గొణిగాయి.

రూపాయిపావలా కూడబెట్టడానికే ఎంతో బాధపడిన వరాలమ్మ వెయ్యిరూపాయలగురించి ఎలా ఆలోచించగలదు? ఆమె కమ్మని కల కరగిపోయింది.